సాక్షి
కామారెడ్డి
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



పకడ్బందీగా సర్వే చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 9లో ▸



అభివృద్ధికి ఆమడదూరం

పాలకులు పట్టించుకోకపోవడంతో బాన్సువాడ పట్టణంలో విలీనమైన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
27.4 /10.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి'

కామారెడ్డి క్రైం: కక్షిదారులు శనివారం నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. రాజీ కుదుర్చుకోదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ నిర్వాహణ, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ తదితర కేసులు ఉంటాయని పేర్కొన్నారు. రాజీ కుదుర్చుకోదగిన అన్ని రకాల కేసులను మెగా లోక్ అదాలత్ ద్వారా వెంటనే పరిష్కరిస్తారని తెలిపారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కోర్టు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

దివ్యాంగులపై సానుకూల దృక్పథం ఉండాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): దివ్యాంగ విద్యార్థుల విషయంలో సానుకూల దృక్పథంతో ఉండాలని డీఈవో రాజు సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని భవిత సెంటర్ ఆవరణలో గురువారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. దివ్యాంగులపై ఎలాంటి వివక్ష చూపవద్దని, దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామ స్వామి, జిల్లా సెక్టోరియల్ అధికారి వేణు, కో–ఆర్డినేటర్ కృష్ణచైతన్య, ఎంఎస్‌వో రమేష్, స్పెషల్ ఎడ్యుకేటర్లు సురేష్, అంబాదాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన సోయా విత్తనాలు అందిస్తాం



వేల్పూర్: రాష్ట్ర రైతాంగానికి నాణ్యమైన సోయా విత్తనాలను అందిస్తామని సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌లో అవసరమయ్యే లక్ష క్వింటాళ్ల విత్తనాల కోసం సీడ్ కార్పొరేషన్ అధికారులతో కలిసి బుధ, గురువారాల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అన్వేష్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంతోపాటు విత్తనాభివృద్ధి సంస్థను మిగతా రాష్ట్రాల అనుబంధంతో దేశంలో ముందంజలో ఉంచేందుకు ఇండోర్, భోపాల్ ప్రాంతాలను సందర్శించామన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, అధికారులతో సమావేశమై సోయాబీన్ విత్తన ఆవశ్యకత, తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్‌కు శనగ, జొన్న, సజ్జ విత్తనాల సరఫరాపై చర్చించామన్నారు. ఇండోర్‌లోని విత్తన శుద్ధి కర్మాగారాన్ని సందర్శించి విత్తన నాణ్యత, ప్యాకింగ్‌ను పరిశీలించినట్లు వెల్లడించారు.

మంత్రి గారూ.. నిధులివ్వరూ?

- అసంపూర్తిగా 'సాగర్' ప్రధాన కాలువ లైనింగ్ పనులు
- కొట్టుకుపోయిన సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్
- కుడి, ఎడమ కాలువలకు బుంగలు
- వృథా అవుతున్న జలాలు
- మంత్రి దృష్టి సారించాలని కోరుతున్న రైతులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ పనులు దశాబ్దాలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. డిస్ట్రిబ్యూటరి తూముల ఆధునికీకరణ పనుల్లో నాణ్యత లోపించడంతో అధ్వానంగా మారాయి. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలతో సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోయి నీరు వృథా అయ్యింది. శుక్రవారం జిల్లాకు వస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. ఆయా అంశాలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.



సిమెంట్ లైనింగ్ లేక దెబ్బతిన్న నిజాంసాగర్ ప్రధాన కాలువ

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రధాన కాలువ 150 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గతంలో ప్రాజెక్టు ద్వారా 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందేది. అయితే ప్రధాన కాలువ కట్ట బలహీనంగా మారడంతో చివరి ఆయకట్టుకు సాగు నీటిని అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆయకట్టు విస్తీర్ణం తగ్గుతూ వచ్చింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రాజెక్టు ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ కోసం రూ. 549.5 కోట్లు మంజూరు చేశారు. 15 ప్యాకేజీలుగా విభజించి పనులకు శ్రీకారం చుట్టారు. నాలుగైదేళ్లలో పూర్తికావాల్సిన పనులు.. ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రధాన కాలువ మట్టి కట్టతో పాటు సిమెంట్ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీ తూముల ఆధునికీకరణ పనుల్లోనూ నాణ్యత లోపించింది. దీంతో పదికాలాల పాటు పక్కగా నిలవాల్సినవి మూణ్నాళ్లకే పగుళ్లు వచ్చాయి.

ఆ రెండు ప్యాకేజీల సంగతి అంతేనా?

నిజాంసాగర్ ప్రధాన కాలువ ఒకటి, రెండు ప్యాకేజీల్లో ఆధునికీకరణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఒక్కో ప్యాకేజీకి రూ. 35 కోట్లతో పనులు ప్రారంభించారు. ఒకటో ప్యాకేజీలో 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. మిగతా పనులను గాలికి వదిలేశారు. రెండో ప్యాకేజీలో నామమాత్రంగానే పనులు చేపట్టారు. ఐదు, ఆరో డిస్ట్రీబ్యూటరీల మధ్య ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ పనులను వదిలేశారు. దాంతో ప్రధాన కాలువ కొట్టుకుపోకుండా ఏర్పాటు చేసిన బండ రాళ్లు ఊడిపోయి, కాల్వ కట్ట గోడలు కూలి పోయి అధ్వానంగా తయారయ్యాయి. అంతేకాకుండా కాలువ కట్టకు ఇరువైపులా చెట్లు పెరగడంతో ప్రమాదకరంగా మారింది. రెండో ప్యాకేజీలో కిలోమీటర్ మేర సిమెంట్ లైనింగ్ పనులు చేయాల్సి ఉంది. ప్రధాన కాలువ సిమెంట్ లైనింగ్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాలుగేళ్ల నుంచి పత్తాలేకుండా పోయారు.

మొరాయిస్తున్న గేట్లు..

నిజాంసాగర్ ప్రాజెక్టు 12 గేట్ల ప్రాంతంలోని 6, 7, 11 ఫ్లడ్ గేట్లు తరచూ మొరాయిస్తున్నాయి. శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రాజెక్టునుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. అయితే మంత్రి ఎత్తే గేట్లు సైతం మెరుగ్గా ఏమీ లేవు. ఇక్కడ రెండు గేట్లు మొరాయిస్తున్నాయి. ఎత్తిన గేట్లను దించాలంటే గజ ఈతగాళ్లు సాయం చేయాల్సిందే.. ఫ్లడ్ గేట్లకు మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. మహ్మద్‌నగర్ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువకు ఇటీవల బుంగపడింది. మంత్రి ఆయా అంశాలపై దృష్టి సారించి, నిధులు మంజూరు చేసి సాగునీటి సమస్యలు పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహమ్మద్‌నగర్ మండలంలో ఉన్న సింగితం రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో రిజర్వాయర్ ఖాళీ అయ్యింది. రిజర్వాయర్ అలుగు ముందు ఏర్పడిన బుంగలు రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోవడానికి ప్రధాన కారణం అయ్యాయి. రిజర్వాయర్ ద్వారా మహమ్మద్‌నగర్,

శిథిలావస్థలో 'సింగితం' కాలువలు..

నర్వ, గున్కుల్ గ్రామాల పరిధిలోని 546 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. అయితే రిటెయినింగ్ వాల్ కొట్టుకు పోవడంతో పాటు కుడి, ఎడమ పంట కాలువలు శిథిలావస్థకు చేరడంతో ఆయకట్టుకు సాగు నీరు అందే పరిస్థితి లేదు. రిజర్వాయర్ రిటెయినింగ్ వాల్‌తో బుంగలకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, కుడి, ఎడ కాలువలకు సిమెంట్ లైనింగ్ పనులు చేయించాలని రైతులు కోరుతున్నారు.



సింగితం రిటెయినింగ్ వాల్ కొట్టుకుపోవడంతో అడ్డుగా ఇసుక బస్తాలు వేస్తున్న దృశ్యం(ఫైల్)

నేడు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాక

నిజాంసాగర్: యాసంగి పంటల సాగు అవసరాలకు నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను ప్రారంభించడానికి శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రానున్నారు. ఉదయం 10 గంటలకు గోర్గల్ గేటు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్ల వద్దకు వెళ్తారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వస్తుండడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గోర్గల్ గేటు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు పనులను ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ కిషన్, జేఈ వినయ్‌కుమార్ పరిశీలించారు. హెలిప్యాడ్‌తో పాటు మంత్రి పర్యటించే రూట్‌లో బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్సై శివకుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు హెడ్‌స్లూయిస్ వద్ద మంత్రి పర్యటన ఏర్పాట్లను నీటిపారుదలశాఖ సీఈ శ్రీనివాస్, ఈఈ సోలోమాన్ పర్యవేక్షించారు.



గోర్గల్ గేటు వద్ద హెలిప్యాడ్ పనులు పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

'డ్రాపవుట్ విద్యార్థులను గుర్తించాలి'



కామారెడ్డి క్రైం: చదువు మానేసిన ఇంటర్ విద్యార్థులను గుర్తించి తిరిగి కళాశాలల్లో చేర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మానసికంగా బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి టెలి మానస్ నంబర్ 14416 ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించాలన్నారు. ఆత్మహత్యల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఉదయం మెడిటేషన్, యోగాలాంటి కార్యక్రమాలను కళాశాలల్లో నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్ –2'ను సజావుగా నిర్వహించాలి

కామారెడ్డి క్రైం: గ్రూప్ –2 పరీక్షలను సజావుగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ –2 పరీక్షలు జరగనున్న నేపథ్యంలో గురువారం పరీక్షల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులను తనిఖీ చేయడం, బయోమెట్రిక్ హాజరును వేగంగా నిర్వహించాలన్నారు. ఎక్కడా సమయాన్ని వృథా చేయరాదన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌సీవో విజయ్ కుమార్, అడిషనల్ ఆర్‌సీవో శంకర్, అధికారులు పాల్గొన్నారు.

రేపు సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

కామారెడ్డి అర్బన్: కౌలాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగామోహన్, సురేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. వివరాలకు 96425 35535, 96405 73703 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైతులందరి రుణాలను మాఫీ చేయాలి

- బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి
- 16న చలో కలెక్టరేట్‌కు పిలుపు



సమావేశంలో పాల్గొన్న బీకేఎస్ ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులందరికి సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్(బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం లింగాపూర్‌లో బీకేఎస్ జిల్లా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని పంటలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎకరానికి రూ.15 వేల రైతు భరోసాను వెంటనే అమలు చేయాలన్నారు. అతివృష్టి, అనావృష్టి నష్టాలకు తగిన పరిహారం ఇవ్వాలన్నారు. ఆయా డిమాండ్ల సాధన కోసం ఈనెల 16న చలో కలెక్టరేట్ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులను కోరారు. సమావేశంలో బీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగేష్, జిల్లా కార్యదర్శి శంకర్‌రావు, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేనా?

- ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- జిల్లాలో లక్షకుపైగా దరఖాస్తులు.. నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు!

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను గుర్తించేందుకుగాను గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో సర్వే ప్రక్రియ ప్రారంభించింది. అర్హులను గుర్తించిన అనంతరం ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో గ్రామసభలను ఏర్పాటు చేసి లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ముందుగా ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు గతంలోనే ప్రభుత్వం ప్రకటించింది. మార్గదర్శకాలు సైతం విడుదల చేసింది. దీంతో నిరుపేదల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

యాప్‌లో వివరాల నమోదు

ప్రభుత్వం మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇంటి నిర్మాణాలకు సంబంధించి బాత్‌రూం, వంటగది తప్పనిసరిగా ఉండేలా ప్లాన్‌ను కూడా ఇప్పటికే రూపొందించారు. తాజాగా లబ్ధిదారుల ఎంపిక సర్వే ప్రారంభమైంది. 500 ఇళ్లకు ఒకరిని నియమించి సర్వే బాధ్యతలు అప్పగించారు. సర్వేయర్‌లుగా పంచాయతీ కార్యదర్శులను నియమించారు. వారు ఇళ్లకు వెళ్లి లబ్ధిదారుల వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్నారు. వివరాలు నమోదు చేశాక సదరు కుటుంబం ఈ పథకానికి అర్హులేనా, కాదా అనేది యాప్ నిర్ణయిస్తుంది.



గూడెంలో సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

భారీగా దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి దాదాపు ఏడాది క్రితం ప్రజాపాలన పేరుతో దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో ఆయా అంశాలకు సంబంధించి మొత్తం 2,94,800 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇందిరమ్మ ఇల్లు కోసం లక్షకుపైగా దరఖాస్తులున్నాయి.

మహిళ పేరుమీదే ఇల్లు..


ఇందిరమ్మ ఇంటిని కుటుంబంలోని మహిళ పేరు మీదే మంజూరు చేయనున్నారు. ఇల్లు పొందాలని కోరుకునే వారు రేషన్ కార్డు కలిగి ఉండి స్థానికుడై ఉండాలి. లబ్ధిదారులుగా ఎంపికైనవారు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్‌సీసీ ఇల్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. నాలుగు విడతల్లో ఆర్థిక సాయం అందిస్తారు. బేస్‌మెంట్ లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్ లెవల్‌కు రూ.లక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రూ.2 లక్షలు, మొత్తం ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.లక్ష చెల్లిస్తారు.

అర్హుల సమాచారాన్ని పక్కాగా సేకరించాలి

కామారెడ్డి రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హుల సమాచారాన్ని పక్కాగా సేకరించి యాప్‌లో పొందుపరచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం గూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పూర్తి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అవసరమైన భూమి పత్రాలు, ఆహార భద్రత కార్డు, ఇంటి యజమానురాలు ఫొటోలను సేకరించాలని, తద్వారా యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. సర్వేకు ఒకరోజు ముందు ఆ గ్రామంలో చాటింపు వేయించాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథ్‌రావు, మండల ప్రత్యేకాధికారి తిరుమల ప్రసాద్, తహసీల్దార్ జనార్దన్, ఎంపీడీవో నాగవర్ధన్ పంచాయతీ కార్యదర్శి సంగీత ఉన్నారు.

ఆర్టీసీకి మహాలక్ష్మి!

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకం ద్వారా ఏడాదిలో ఉమ్మడి జిల్లాలో ఆరు కోట్ల మంది మహిళలు ప్రయాణం చేశారు. ప్రతి రోజు సుమారు 1,70,528 మంది ప్రయాణించారు. ఈ పథకం ద్వారా ఆర్టీసీకి రూ. 223.57 కోట్ల ఆదాయం రావడంతో నష్టాలలో ఉన్న సంస్థకు భరోసా లభించింది. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం..



- ఉమ్మడి జిల్లాలో ఆరు డిపోలు.. 582 బస్సులు
- రోజూ సుమారు 1,70,528 మంది రాకపోకలు
- ఉమ్మడి జిల్లాలో ఏడాదిలో 6 కోట్ల మంది మహిళల ప్రయాణం
- ఏడాదిలో రూ.223.57 కోట్ల ఆదాయం

ఖలీల్‌వాడి: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచితంగా ప్రయాణించడానికి అవకాశం కల్పించింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆరు డిపోలు ఉండగా, 582 బస్సుల ద్వారా ఆర్టీసీ సంస్థ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోంది. వీటిలో పల్లెవెలుగు 317, ఎక్స్‌ప్రెస్‌లు 114 బస్సులు ఉన్నాయి. రాజధాని, సూపర్‌లగ్జరీ, ఎలక్ట్రిక్ బస్సులు కలిపి 151 ఉండగా వీటిని ఎక్కువగా హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు తిప్పుతున్నారు. ఇదిలా ఉండగా మహాలక్ష్మి పథకం ద్వారా 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు ఉమ్మడి జిల్లాలో 6 కోట్లకు పైగా మహిళలు ప్రయాణం చేశారు. ప్రతి రోజు ఈ పథకం ద్వారా సుమారు 1,70,528 మంది ప్రయాణం చేశారు. ఉమ్మడి జిల్లాలో 36 బస్టాండ్‌లు ఉన్నాయి. ఆర్టీసీ బస్సులలో గతంలో 68 శాతం ఆక్యుపెన్సీ ఉండగా మహాలక్ష్మి పథకం కారణంగా ఇప్పుడు 92 శాతం దాటింది.

కామారెడ్డి, బాన్సువాడ నుంచే అధికం

నిజామాబాద్ రీజియన్‌లోని ఆరు డిపోలలో ఎక్కువగా కామారెడ్డి, బాన్సువాడ డిపోల నుంచి మహిళలు ప్రయాణిస్తున్నారు. కామారెడ్డి డిపో నుంచి ఇప్పటి వరకు 1,69,73,712 మంది, బాన్సువాడ డిపో నుంచి 1,01,22,310 మంది ప్రయాణం చేశారు. వీకెండ్స్, హాలీడేస్, పండుగ సమయాల్లో బస్సుల్లో రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది. మిగతా రోజుల్లో సాధారణ ప్రయాణం ఉంటుంది. ట్రాన్స్‌జెండర్లు సైతం మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు.

లక్ష్యాన్ని మించి..

ఉమ్మడి జిల్లాలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. గతంలో నష్టాలలో ఉన్న ఆర్టీసీ డిపోలు ఇప్పుడు లక్ష్యాన్ని మించి లాభాల బాటలో పయనిస్తున్నట్లు ఆర్టీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒక్కో డిపోకు ప్రతి రోజూ సుమారు రూ. 9.68 లక్షల నుంచి రూ.15.75 లక్షల ఆదాయం వస్తుండగా, మొత్తం ఆరు డిపోల ద్వారా సమారు రూ.63.52 లక్షల ఆదాయం సమకూరుతోంది. ఇప్పటి వరకు ఆర్టీసీకి రూ. 223.57 కోట్ల ఆదాయం వచ్చింది.

2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు

డిపో	ప్రయాణికులు	ఆదాయం (రూ.కోట్లలో)
కామారెడ్డి	1,69,73,712	55.44
బాన్సువాడ	1,01,22,310	37.45
ఆర్మూర్	89,32,976	34.08
బోధన్	91,19,707	33.37
నిజామాబాద్-1	85,73,065	30.62
నిజామాబాద్-2	63,04,600	32.61

క్లుప్తంగా

విశ్వవిద్యాలయ క్రీడల్లో కామారెడ్డి క్రీడాకారుల ప్రతిభ



కామారెడ్డి అర్బన్: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడాకారులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. వంద, రెండు వందల మీటర్ల పరుగులో సీహెచ్. కావ్య ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగులో బి.హరిత ద్వితీయ స్థానం పొందగా 1500 మీటర్ల పరుగులో ఎం.అభిత ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగులో డి.భరత్‌రాజ్ ద్వితీయ స్థానం పొందినట్లు వెల్లడించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు.

'పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించాలి'



భిక్కనూరు: రైతులు పాడిపశువుల పెంపకంపై దృష్టి సారించాలని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం కాచాపూర్‌లో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకు పాల డిమాండ్ పెరుగుతుందని.. డిమాండ్ పెరిగినప్పుడు ధర కూడా గిట్టుబాటు అవుతుందని ప్రతి రైతు తప్పని సరిగా పాడి పశువులను పెంచుకోవాలని సూచించారు. పశువులకు తప్పని సరిగా వైద్య పరీక్షలు చేయించాలని పశువైద్య సిబ్బంది సూచించిన సలహాలను పాటించాలన్నారు. పశువైద్యులు దేవేందర్, అనిల్‌రెడ్డి, రమేష్ రాథోడ్, రైతులు పాల్గొన్నారు.

స్టేడియం స్థలం పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): అదనపు కలెక్టర్ విక్టర్ గురువారం మండలంలో పర్యటించారు. జువ్వాడి శివారులో నిర్మించ తలపెట్టిన స్టేడియం స్థలాన్ని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని రికార్డులు పరిశీలించారు. రికార్డులు, స్టేడియం నిర్మించే స్థల విస్తీర్ణం రికార్డులో పక్కాగా పొందుపర్చాలని సూచించారు. అనంతరం జువ్వాడి గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో రాజేశ్వర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీటీ రవి, గిర్దావర్, సర్వేయర్ సిబ్బంది పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి'

బీబీపేట: భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉప్పర్‌పల్లి, జనగామ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని వారు అన్నారు. నాయకులు తలారి ప్రభాకర్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజబాబు, రాము,జాన్,శంకర్, లక్ష్మణ్, సాయిలు, నరేష్,ప్రసాద్, బాబు పాల్గొన్నారు.

నేడు ఇంటింటికి సీపీఎం కార్యక్రమం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో నేడు ఇంటింటి సీపీఎం కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్‌వీ. రమ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సోయా రైతుల గోస పట్టదా..?

- గోనె సంచులు రాక ఆగిన తూకం
- కుప్పలుగా పోసి ఉంచిన రైతులు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రభుత్వం సోయాకు మద్దతు ధర రూ.4892 కల్పిస్తోంది. దళారులు రూ.వేయి తక్కువగా కొనుగోలు చేయడంతో గత్యంతరం లేక మద్దతు ధర దక్కించుకోవాలనే ఆశతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వరుస కట్టారు. కాని అక్కడ గోనె సంచుల కొరత ఏర్పడడంతో రైతులు ముప్పు తిప్పలు పడుతున్నారు. ఒక్కో రైతు సుమారు రెండు వారాల నుంచి రాత్రింబవళ్ల సోయా కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. గోనె సంచులు లేక పెద్దకొడప్‌గల్ సోయా కొనుగోలు కేంద్రంలో తూకం నిలిపివేశారు. ఇప్పటి వరకు 277 మంది రైతుల నుంచి 87,305 బస్తాలు, 41 వేల క్వింటాళ్లు కొనుగోలు చేశారు. ఇంకా కొనుగోలు కేంద్రం ఆవరణలో సుమారు 12 వేల క్వింటాళ్లకు పైగా సోయాలు ఉన్నాయి. రెండు వారాల నుంచి నుంచి సోయా కుప్పల వద్ద రైతులు రాత్రింబవళ్ల చలిలో పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి గోనె సంచుల కొరతను తీర్చాలని కోరుతున్నారు. గోనె సంచుల కొరతపై సొసైటీ కార్యదర్శి సందీప్‌ను వివరణ కోరగా.. కొన్ని రోజులుగా గోనె సంచుల కొరత ఉంది. ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఇప్పటి వరకు రాకపోవడంతో తూకం నిలిపివేశాం. మా కేంద్రానికి 20 వేల సంచుల అవసరం ఉంటుంది.



పెద్దకొడప్‌గల్ సొసైటీలో ఉన్న సోయా పంట

సంచులు లేవు.. తూకం ఆపేశారు



గోనె సంచులు లేక తూకం వేయడం లేదు. నాకు ఉన్న రెండు ఎకరాలు చేనులో సోయా పంట వేశా. సుమారు 30 బస్తాలు అవుతాయి. గత వారం రోజుల నుంచి ఇక్కడ పడిగాపులు కాస్తున్నాను. ఉన్నత అధికారులు స్పందించి సంచులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు ప్రారంభించాలని కోరుతున్నాం.

– ఎయిరే శాంతవ్వ, రైతు, పెద్దకొడప్‌గల్

సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన



జిల్లా కేంద్రంలో చాయ్ కప్పులతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ముందు చేపడుతున్న సమ్మె శిబిరంలో చాయ్ కప్పులను పైకెత్తి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ .. సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం మహిళా అధ్యక్షురాలు వాసంతి, గౌరవ అధ్యక్షులు శ్రీధర్ కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల మద్దతు

సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల నేతలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులకు ఎస్టీయూ పక్షాన రూ.3 వేలు, బీటీఏ జిల్లా కమిటీ రూ.2 వేలు, టీటీయూ జిల్లా అధ్యక్షుడు ముజీబోద్దీన్ రూ. వేయి అందజేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కృష్ణారావు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998–2000కు చెందిన హెచ్‌ఈసీ గ్రూప్ పూర్వ విద్యార్థులు గురువారం సమ్మేళనం చేపట్టారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. –భిక్కనూరు

130 కిలోల పటిక, బెల్లం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బెల్లం సంచులు

కామారెడ్డి క్రైం: రైలులో అక్రమంగా తరలిస్తున్న 130 కిలోల పటిక, బెల్లంను కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్, ఆర్పీఎఫ్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మధ్యాహ్నం దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు కామారెడ్డికి చేరుకోగానే తనిఖీలు చేపట్టారు. 100 కిలోల బెల్లం , 30 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. వాటిని తరలిస్తున్నది ఎవరనేది తెలియలేదు. కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపారు.

డ్రైవర్ తప్పిదం.. ప్రయాణికుల ఆగ్రహం



భిక్కనూరు: ఆర్టీసీ డ్రైవర్ తప్పిదం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలో డీజిల్ లేక ఆర్టీసీ బస్సు ఒకటి నిలిచిపోయిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు..బోధన్ డిపో ఆర్టీసీ బస్సు సికింద్రాబాద్ వెళ్తుండగా భిక్కనూరు టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ బస్సును స్టార్ట్ చేసేందుకు యత్నించినా స్టార్ట్ కాలేదు. దీంతో ప్రయాణికులు కొందరూ డీజిల్ ఉందా లేదా చూడమని డ్రైవర్‌కు సూచించడంతో ఆయన డీజిల్ ట్యాంక్‌ను చెక్ చేశారు. అందులో డీజిల్ లేకపోవడంతో ప్రయాణికులు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజిల్ లేకుండా బస్సును ఎలా రోడ్డుపై తెచ్చారని కోపడ్డారు. విషయం తెలిసి జీఎంఆర్ సంస్థకు చెందిన నేషనల్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది డీజిల్ తీసుకొచ్చి ట్యాంక్‌లో పోయడంతో బస్సు స్టార్ట్ అయ్యింది. వెంటనే సికింద్రాబాద్ పయనమయ్యారు.

ప్రభుత్వ పాఠశాల బాలికలకు సైకిళ్ల పంపిణీ



బాలికలకు సైకిళ్లను అందజేస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 25 మంది పేద విద్యార్థినులకు కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్లను ఉచితంగా అందజేశారు. రోటరీ క్లబ్‌లో గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చేతుల మీదుగా బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వరంగల్ సెంట్రల్ క్లబ్ రోటేరియన్ జూలూరు కృష్ణమూర్తి సహకారంతో ప్రభుత్వ పాఠశాలల పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందించడం అభినందనీయమన్నారు. డీఈవో రాజు, రొటేరియన్ కోరే చంద్రమౌళి, అసిస్టెంట్ గవర్నర్ జ్ఞాన ప్రకాష్, క్లబ్ సెక్రటరీ సత్యనారాయణ, కోశాధికారి సబ్బని కృష్ణహరి, సీనియర్ ప్రతినిధి శ్రీశైలం, ప్రోగ్రాం చైర్మన్ పి.సత్యం, ప్రతినిధులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో మానసిక సంకల్ప సామర్థ్యాలను గుర్తించాలి'



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ కరీం

కామారెడ్డి అర్బన్: విద్యార్థుల్లో మానసిక సామర్థ్యాలను గుర్తించి సానుకూలంగా ప్రేరేపిస్తే వారిలో ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతాయని, చదువులో రాణిస్తారని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మైండ్ పవర్ స్పెషలిస్ట్, సైకలాజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం అన్నారు. గురువారం స్థానిక బాబాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో విద్యార్థులకు మనోవైజ్ఞానిక అవగాహన సదస్సు, సీక్రెట్స్ ఆఫ్ మైండ్ పవర్ అంశంపై కరీం మాట్లాడగా అంతర్జాతీయ మెజీషియన్ రామకృష్ణ ఆనందం కల్గించే ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు. సైకలాజిస్ట్ కరీం మాట్లాడుతూ.. పిల్లలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చదువు చదువు అంటూ వేధించవద్దని సూచించారు. ఏకాగ్రత జ్ఞాపకశక్తిపై నిర్వహించిన రాష్ట్రస్థాయి మెమొరీ కాంటెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. హెల్ప్ లైన్ కోసం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 040–35717915, 9440488571 నంబర్లకు సంప్రదించవచ్చన్నారు. సైకలాజికల్ రాష్ట్ర స్థాయి హెల్ప్‌లైన్ లోగోను ఆవిష్కరించారు.

వర్క్‌సైట్ స్కూల్ ప్రారంభం



ముస్తాపూర్‌లో వర్క్‌సైట్ స్కూల్ ప్రారంభిస్తున్న డీఈవో రాజు

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్‌లో వర్క్‌సైట్ స్కూల్‌ను గురువారం డీఈవో రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటుక బట్టీల వద్ద పనులు చేసే కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక పాఠశాలలు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్క్‌సైట్ స్కూల్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారుల విలువైన చదువులు నష్టపోకుండా ప్రభుత్వం ప్రతీ ఏటా ఇట్టుక బట్టీలు, చెరుకు కొట్టే కూలీలు ఉండే ప్రాంతాల్లో వర్క్‌సైట్ స్కూల్స్ ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు ప్రతీ రోజు చిన్నారులు పాఠశాలకు వెళ్లే విధంగా చూడాలన్నారు. అనంతరం చిన్నారులకు నోటుబుక్కులు, పలకలు, పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఎంఈవో షౌకత్‌అలీ, ఏఎంవో వేణుశర్మ, నల్లమడుగు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు, ముస్తాపూర్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సుధాకర్, ఇటుక బట్టీల నిర్వాహకుడు సంజీవులు పాల్గొన్నారు.

లాటరీ పేరుతో ఘరానా మోసం

భిక్కనూరు: లాటరీ పేరుతో ఓ వ్యక్తి మోసపోయినట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బస్వాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. ఫోన్‌లో ఈ నెల 4న ఫేస్‌బుక్ చూస్తుండగా లాటరీ అని కనిపించడంతో దానిని క్లిక్ చేశాడు. ఆయనకు వాట్సప్ కాల్ చేసి మీకు రూ. 60 లక్షలు, 10 తులాల బంగారం, ఒక ఐఫోన్ లాటరీ తగిలిందని నమ్మించారు. ఇందుకు గాను ట్యాక్స్‌ల రూపంలో డబ్బులు చెల్లించాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యక్తి ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పలు బ్యాంకుల ద్వారా సైబర్ నేరగాళ్లు పంపిన అకౌంట్ నంబర్లకు రూ. 7,20,100 నగదును చెల్లించాడు. తిరిగి వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాచారెడ్డిలో..

మాచారెడ్డి: మండల కేంద్రంలో సైబర్ మోసం జరిగినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం భవానీపేటకు చెందిన మహేశ్ అనే యువకుడి సెల్‌ఫోన్‌కు ఈ 10న మహిళ పేరుతో హాయ్ అని మెసేజ్ వచ్చింది. దీంతో సదరు యువకుడు మళ్లీ హాయ్ అని బదులిచ్చాడు. కొద్ది సేపు చాటింగ్ చేసిన తర్వాత ఓ లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేస్తే స్టార్ హోటల్లో గదులు ఉచితంగా ఇప్పిస్తామని చెప్పడంతో సదరు యువకుడు లింక్ ఓపెన్ చేయగానే తన ఖాతాలో ఉన్న రూ. 52 వేలు ఖాళీ అయ్యాయి. దీంతో సైబర్ మోసం జరిగినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ యువకులు

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట శివారులో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మండలంలోని కందకుర్తి నుంచి మద్యం మత్తులో వస్తున్న కృష్ణను వీరన్నగుట్ట గ్రామానికి చెందిన సంతోష్ అనే యువకుడు నిజామాబాద్ నుంచి తిరిగి వస్తుండగా ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సకాలంలో చేరుకున్న సిబ్బంది ఈఎంటీ సంజీవ్‌గౌడ్, ఈఆర్‌సీపీ డాక్టర్ శివ ప్రథమ చికిత్సలు అందించి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు 108 సిబ్బంది పేర్కొన్నారు. ఈ విషయమై రెంజల్ ఎస్సైని వివరణ కోరగా ఫిర్యాదు రాలేదని తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి జరిమానా

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఓపెన్ ఎస్సెస్సీ తెలుగు పరీక్షలో ఒకరి పరీక్షకు మరొకరు పరీక్ష రాసి పట్టుబడిన కేసులో ఇద్దరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. 2017లో ఆర్మూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో ఓపెన్ ఎస్సెస్సీ తెలుగు పరీక్ష రాయాల్సిన ఎండీ ఫయిజుద్దీన్ అతనికి బదులు ఎండీ ముమిత్ తెలుగు పరీక్ష రాస్తూ ఇన్విజిలేటర్‌కు పట్టుబడ్డాడు. దీంతో పరీక్ష సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయగా ఇరువురిపై చీటింగ్ కేసు నమోదైంది. విచారణలో చీటింగ్ చేసినట్లు రుజువు కావడంతో రూ. 10వేల చొప్పున ఇరువురికి జడ్జి జరిమానా విధించారని ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం

రుద్రూర్: పోతంగల్ సమీపంలో ఉన్న మంజీరా నదిలో ఇసుకను అక్రమంగా తవ్వకాలు చేసి క్వారీకి వెళ్లే దారిలో నిల్వ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య పేర్కొన్నారు. ఇసుక డంప్ 20 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు ఉంటుందని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక డంప్ చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి, యాజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాక్టర్ పట్టివేత..

నవీపేట: మండలంలోని జన్నెపల్లి వాగు నుంచి ఇసుకను గురువారం అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండానే వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను తహస్లీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిలో ముగ్గురిని అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారైనట్లు ఎస్సై సాయన్న గురువారం పేర్కొన్నారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేశామని వీరి నుంచి రూ. 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బుధవారం రాత్రి, గురువారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు.

ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడు..



నవీన్ కుమార్(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొన్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోలోని శాబ్దిపూర్ బైపాస్ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన వడ్ల బాలవ్వ, నర్సింలుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు నవీన్‌కుమార్(25) కామారెడ్డిలోని ఓ కార్పెంటర్ దుకాణంలో దినసరి కూలీగా పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి పనులు ముగించుకుని 10 గంటల ప్రాంతంలో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా శాబ్దిపూర్ బైపాస్ ప్రాంతంలో రోడ్డుపై నిర్లక్ష్యంగా ఆగి ఉన్న ట్రాక్టర్‌ను నవీన్‌కుమార్ వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ హోంగార్డు..



బాలయ్య మృతదేహం(ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ మాజీ హోంగార్డు మృతి చెందాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తాడ్వాయి మండలం దేమికలాన్ గ్రామానికి చెందిన చెవిటోళ్ల బాలయ్య (70) గతంలో హోంగార్డుగా పని చేసి రిటైర్ అయ్యాడు. కామారెడ్డికి వచ్చిన అతడు బ్రిడ్జి వద్ద రోడ్డు దాటుతుండగా అటుగా వెళ్తున్న ఓ క్రేన్ వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

మూర్ఛతో గేదెల కాపరి ..



నారాయణ మృతదేహం

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లికి చెందిన గేదెల కాపరి తోకల నారాయణ(39) మూర్ఛతో మృతిచెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణ గేదెలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారి పనిలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు గ్రామ శివారుకు గేదెలను తీసుకెళ్లాడు. అతను కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. గేదెలను మోపడానికి వెళ్లిన నారాయణ లంబాడి సర్ధార్ వ్యవసాయ భూమిలోని నీటి మడిలో మూర్ఛవ్యాధితో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు నారాయణ కోసం వెతుకుతుండగా, గురువారం ఉదయం నీటి మడిలో పడి మృతిచెంది ఉన్నాడు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి గుర్తు తెలియని వ్యక్తి..

బోధన్‌టౌన్: పట్టణ శివారులోని పసుపువాగులో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడు. గురువారం పసుపు వాగులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతిడి వయస్సు 30 ఏళ్ల వరకు ఉంటుందని, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంట్‌తో పాటు గోదుమ కలర్ షర్టు, గ్రీన్ కలర్ బనియన్ ధరించి ఉన్నాడని అన్నారు. ఆచూకి తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.

చెరువులో పడి..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన బండి గంగారాం(60) ప్రమాదవశాత్తు పెద్ద చెరువులో పడి మృతి చెందాడు. జక్రాన్‌పల్లికి చెందిన బండి గంగారాం పని నిమిత్తం పడకల్ తండాకు వెళ్లి సైకిల్‌పై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో చెరువు వద్ద కాలకృత్యాలకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. నీటిలో ట్రాక్టర్ టైర్లతో కూడిన గుంత ఉంది. దీంతో నీటిలో పడగానే ఊపిరాడక మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య భారతి, కుమార్తె సౌమ్య ఉన్నారు.

కారు బోల్తా.. డ్రైవర్ మృతి



ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ శివారులోని జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి కారు బోల్తా పడిన ఘటనలో వనపర్తికి చెందిన కారు డ్రైవర్ ప్రకాశ్(18) మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన మద్దెల చందు ఆర్మూర్ మండలం కోటార్మూర్‌కు చెందిన స్నేహితుడు అక్షయ్ మరదలి వివాహం భీంగల్‌లో ఉండగా హైదరాబాద్ నుంచి కారు అద్దెకు తీసుకొని బుధవారం వివాహానికి వచ్చారు. భీంగల్ నుంచి పెర్కిట్‌లోని అక్షయ్ ఇంటికి చేరుకోగా అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో డ్రైవర్ ప్రకాశ్‌తో పాటు మరో ఆరుగురు టీ తాగేందుకు బయలుదేరగా కాంతి స్కూల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద కారు అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రకాశ్‌కు తీవ్ర గాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశ్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ..



సంగ్యానాయక్, లక్ష్మీబాయి (ఫైల్)

నిజాంసాగర్: సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం కిష్టాపూర్ శివారులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇస్లావత్ సంగ్యానాయక్(55), ఇస్లావత్ లక్ష్మీబాయి(48) భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. నిజాంసాగర్ మండలం మల్లూర్ తండాకు చెందిన ఇస్లావత్ సంగ్యానాయక్, లక్ష్మీబాయి దంపతులు. వీరు సంగారెడ్డి జిల్లాలోని అనకాపల్లిలో ఉన్న తమ కుమార్తె ఇంటికి ఎక్స్‌ఎల్ మోపెడ్‌పై బయలు దేరారు. కల్హేర్ మండలం కిష్టాపూర్ శివారులో వీరి వాహనాన్ని తారు వాహనం బలంగా ఢీకొన్నది. ఈ ఘటనలో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దంపతుల మృతితో తండాలో విషాద చాయలు అలుముకున్నాయి.